జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 20 | మే | 2026 ◆ పేజీలు : 8



## రైతులకు ఇబ్బందులు లేకుండా మొక్కజొన్న కొనుగోళ్లు చేపడుతున్నాం...

- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 19, (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

మిగతా 2 లో...

### తాజాపై మాజీ విమర్శలవిల్లు

### భద్రాచలం ఎమ్మెల్యే నేనే అంటూ వ్యాఖ్యలు

6 లో..



# భద్రాద్రిలో... పొలిటికల్ వార్

భద్రాద్రి రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి. ఇంతకాలం ముసుగులో సాగిన అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగ రాజకీయ సమరానికి దారితీస్తున్నాయి. అధికార పార్టీ జెండా కింద నడుస్తున్న నాయకులు ఇప్పుడు ఒకరిపై ఒకరు మాటల బాణాలు సంధిస్తుండటంతో భద్రాచలం రాజకీయ వాతావరణం హాట్ హాట్‌గా మారింది. “ఒకే చెట్టుకు రెండు కొమ్మలు” అన్నట్టుగా ఇరువురు నేతల మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగా బయటపడుతోంది. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి.

● భద్రాచలం, ప్రజాజ్యోతి

## మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్




**భద్రాచలం టౌన్, మే 19 ప్రజాజ్యోతి** పచ్చని చెట్లు– ప్రగతికి మెట్లు అన్న సూత్రాన్ని ప్రజలు దృష్టిలో పెట్టుకొని ప్రతిరోజు వారి దైనందన జీవితంలో భాగంగా పర్యావరణం పచ్చధనం పరిశుభ్రంగా ఉండాలంటే తప్పనిసరిగా పర్యావరణాన్ని కాపాడుకొనుటకు విరివిగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ఆవరణలో జెన్ జాతీయ గరిమ ఉత్సవ్ 2026 జన్ భాగీ దారి సబ్సే దూర్ సబ్సేపహలె కార్యక్రమం సందర్భంగా యూనిట్ అధికారులతో కలిసి వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ఏరియా పరిధిలోని 130 గిరిజన గ్రామాలలో జన్ జాతీయ గరిమ ఉత్సవ్ సందర్భంగా ఆయా గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలు మరియు అంగన్వాడి పాఠశాలలు ప్రభుత్వ పాఠశాలలు, గ్రామపంచాయతీ బిల్డింగులలో ఈ కార్యక్రమానికి నియమించబడ్డ

మిగతా 2 లో...

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే జారె
- దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే జారె విస్తృత పర్యటన

2 లో...



## పాల్వంచలో ‘పుష్ప’ తరహా మద్యం సిండికేట్



- అక్రమ విక్రయాలపై ఆరోపణలు
- అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు.
- ఎక్సైజ్ సీఐ జాడెక్కడ ..? అంటూ ప్రశ్నిస్తున్న ప్రజలు.

**పాల్వంచ, మే 19, (ప్రజాజ్యోతి):** పాల్వంచ పట్టణం , పరిసర గ్రామీణ ప్రాంతాల్లో అక్రమ మద్యం విక్రయాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక వైన్ షాపుల్లో లభ్యం కాని పలు మద్యం బ్రాండ్లు గ్రామీణ బెల్ట్ షాపుల్లో సులభంగా దొరుకుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. ‘పుష్ప’ సినిమా తరహాలో మద్యం సిండికేట్ వ్యవస్థ నడుస్తోందనే చర్చ స్థానికంగా జోరందుకుంది.

### ››› వైన్ షాపుల్లో లేని బ్రాండ్లు బెల్ట్ షాపుల్లో ఎలా?

లైసెన్స్ పొందిన వైన్ షాపుల్లో కొన్ని బ్రాండ్లు స్టాక్ లేదని చెబుతుండగా, అదే బ్రాండ్లు బెల్ట్ షాపుల్లో విరివిగా లభిస్తున్నాయి. ఈ మద్యం సరఫరా అధికారిక నిల్వల నుంచే మళ్లింపా? లేక అక్రమ మార్గాల ద్వారా చేరుతోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### ››› ఎంఆర్పీ కంటే అధిక ధరలు

మద్యం సీసాలపై ముద్రించిన ధర కంటే రూ.50 నుంచి రూ.100 వరకు అధికంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. బిల్లు లేకుండా విక్రయాలు జరగడం వల్ల

మిగతా 2 లో...

## మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

అధికారులు ఈ రోజు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత చేపడతారని అన్నారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మారుమూల గిరిజన ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి ఈనెల 19 నుంచి జన జాతీయ గరిమ ఉత్సవాలను ప్రారంభించి 25వ తేదీ వరకు ఆయా గ్రామాలలో గిరిజనులకు కావలసిన మౌలిక వసతుల కల్పనకు అధికారులు తప్పనిసరిగా వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని కేంద్ర ప్రభుత్వానికి నివేదిస్తారని అన్నారు. దానిలో భాగంగా ఈ రోజు మనం పని చేసే కార్యాలయాలలో మనకు ప్రాణవాయువును ప్రసాదించే చెట్లను నాటి వాటిని సక్రమంగా పెంచి వాతావరణం కలుషితం కాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అశోక్, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, పి వి టి జి అధికారి గన్య, ఎస్ డి సి ఆనంద్ కుమార్, ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, డి టి ఎల్ టి ఆర్ మనిధర్, ఇల్లందు ఏ టి డి ఓ భారతీదేవి పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా మొక్క జొన్న కొనుగోళ్లు చేపడుతున్నాం

(మొదటి పేజీ తరువాయి...)

కొనుగోలు కేంద్రాల్లో తూకం, హమాలీ, రవాణా తదితర ఏర్పాట్లు సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లా వ్యాప్తం గా ఏర్పాటు చేసిన ప్యాక్స్ కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు మొత్తం 3,76,288 క్వింటాళ్ల మొక్కజొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు. అందులో 2,19,729.5 క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలలో 1,56,558.5 క్వింటాళ్ల మొక్కజొన్న నిల్వ ఉన్నట్లు తెలిపారు. మంగళవారం ఒక్కరోజులోనే 10,091.5క్వింటాళ్ల మొక్కజొన్నను గోదాములకు తరలించినట్లు తెలిపారు. రవాణా కోసం 458 లారీలు, 131 ట్రాక్టర్లు వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. అదనంగా మరో 1,50,000క్వింటాళ్ల మొక్కజొన్నకొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఇల్లందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, పాల్వంచ, జూలూరుపాడు, గుండాల, అల్లపల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న మొక్కజొన్నను త్వరితగతిన గోదాములకు తరలిస్తూ కొనుగోలు ప్రక్రియను నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని అన్నారు . రైతుల ఖాతాల్లో చెల్లింపులు వేగంగా జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ అంకిత్ తెలిపారు.

## అక్రమంగా పశువుల తరలిస్తున్న బొలెరో పట్టివేత



**టేకులపల్లి,మే19, ప్రజాజ్యోతి :**టేకులపల్లి మండల కేంద్రంలోని తడికలపూడి క్రాస్ రోడ్ 930పి జాతీయ రహదారి పై మంగళవారం ఉదయం బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న చిన్న దూడలు 03,గిత్తలు 03 =6 పశువులను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై ఆలకుంట రాజేందర్ తెలిపారు.టేకులపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో పశువులు కొనుగోలు చేసి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా బోలేరో వాహనంలో తరలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.మంగళవారం తెల్లవారుజామున తమ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో రెండు బొలెరో వాహనాలు వస్తుండగా తనిఖీ చేశామని చెప్పారు. పట్టుకున్న నిందితులు భూక్య ఈరు,కొర్ర రామ లపై కేసు నమోదు చేసి, పట్టుకున్న పశువులను పాల్వంచ అమ్మ గోషాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పాల్వంచలో 'పుష్ప' తరహా మద్యం సిండికేట్

(మొదటి పేజీ తరువాయి...)

వినియోగదారులు ప్రశ్నించే అవకాశం లేకుండా పోతోందని అంటున్నారు.

### ››› ప్రతి గ్రామంలో బెల్ట్ షాపుల విస్తరణ

పాల్వంచ పరిసర గ్రామాల్లో అనధికారికంగా అనేక బెల్ట్ షాపులు నడుస్తున్నాయని సమాచారం. ఇళ్లలో, కిరాణా దుకాణాల వెనుక భాగాల్లో, గల్లీల్లో గుప్తంగా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### ››› మైనర్లకు సులభంగా మద్యం అందుబాటు

వయస్సు ధృవీకరణ లేకుండా విక్రయాలు జరగడం వల్ల విద్యార్థులు, మైనర్లు కూడా మద్యం సులభంగా పొందుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది యువతను వ్యసనానికి దారితీస్తోందని వారు చెబుతున్నారు.

### ››› అర్ధరాత్రి వరకు విక్రయాలు

నిబంధనల ప్రకారం నిర్దిష్ట సమయం తర్వాత మద్యం విక్రయాలు నిలిపివేయాల్సి ఉన్నప్పటికీ, అనేక బెల్ట్ షాపులు అర్ధరాత్రి దాటినా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. రాత్రివేళల్లో అధిక ధరలకు విక్రయాలు మరింత పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

### ››› సిండికేట్ వ్యవస్థపై అనుమానాలు

ఈ అక్రమ మద్యం వ్యాపారానికి వెనుక ఓ వ్యక్తి ఆధిపత్యం చెలాయిస్తున్నారనే ప్రచారం ఉంది. గ్రామాల వారీగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసి మొత్తం సరఫరా వ్యవస్థను ఒకే వ్యక్తి నియంత్రిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ››› పోలీసుల పర్యవేక్షణపై ప్రశ్నలు

బెల్ట్ షాపులు బహిరంగంగానే నడుస్తున్నా, పెట్రోలింగ్ పోలీసులు గుర్తించలేకపోవడం పై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో చర్యలు కనిపించకపోవడంతో మామూళ్ల వ్యవహారం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### ››› బెల్ట్ షాపుల వద్ద గొడవలు

మద్యం సేవించిన వ్యక్తుల మధ్య తరచూ గొడవలు,దాడులు చోటుచేసుకుంటున్నాయి. రాత్రివేళల్లో గందరగోళ పరిస్థితులు నెలకొని మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు.

### ››› ఎక్సైజ్ సీఐ స్పందనపై విమర్శలు

ఈ వ్యవహారంపై వివరణ కోసం ఎక్సైజ్ సీఐను ఫోన్ ద్వారా సంప్రదించగా, ఆయన ఫోన్ ఎత్తినప్పటికీ స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా విషయాన్ని దాటవేసినట్లు సమాచారం. అక్రమ మద్యం విక్రయాలపై స్పష్టత ఇవ్వకపోవడం, ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పకపోవడం వల్ల సిండికేట్‌తో కొంతమంది ఎక్సైజ్ అధికారుల కుమ్మక్కు ఉందా..? అనే అనుమానాలు ప్రజల్లో మరింత బలపడుతున్నాయి. మరి కొంత మంది నేరుగా పలుమార్లు పిర్యాదు చేయడానికి ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లగా ఎక్సైజ్ సీఐ అందుబాటులో ఉండటం లేదని ఆరోపిస్తున్నారు.

### ››› అధికారుల నిర్లక్ష్యం - ప్రజల్లో ఆగ్రహం

పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత శాఖల నుంచి స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖల మధ్య సమన్వయం లోపం కారణంగా అక్రమ విక్రయాలు అదుపులోకి రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ››› తక్షణ చర్యలకు ప్రజల డిమాండ్

అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక దాడులు నిర్వహించి బెల్ట్ షాపులను మూసివేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖలు సంయుక్తంగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సరఫరా వ్యవస్థపై దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పాల్వంచలో పెరుగుతున్న ఈ అక్రమ మద్యం వ్యాపారంపై అధికారులు వెంటనే స్పందించి కట్టడి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

## గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే జారె
- దమ్మపేట మండలంలో ఎమ్మెల్యే జారె విస్తృత పర్యటన





**దమ్మపేట, మే.19(ప్రజాజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం దమ్మపేట మండలంలోని నాగుపల్లి, నాచారం, మొద్దులగూడెం గ్రామపంచాయతీలలో ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజలతో మమేకమయ్యారు. పర్యటన సందర్భంగా ఇటీవల వివాహం జరిగిన నూతన దంపతులను కలిసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్న ఎమ్మెల్యే, అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని తెలిపారు. నాచారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, దమ్మపేట సొసైటీ చైర్మన్ యెల్లిన రాఘవరావును ఆయన నివాసంలో కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించిన లబ్ధిదారులను కలిసి ఎమ్మెల్యే అభినందించారు. ప్రభుత్వం పేదల గృహ కలను సాకారం చేస్తోందని పేర్కొన్నారు.దమ్మపేట మండల కేంద్రంలోని విశ్రాంత ఉపాధ్యాయుల కమ్యూనిటీ భవనానికి ప్రభుత్వం మంజూరు చేసిన కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంకంపాలెం గ్రామంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన నిర్వహించారు. గిరిజన విద్యార్థినులకు మెరుగైన విద్యా వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఉపసర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం ఆధ్వర్యంలో సుందరయ్యకు నివాళులు

- సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి ...
.సీపీఎం మండల కమిటీ పిలుపు

**దమ్మపేట, మే.19(ప్రజాజ్యోతి):** కమ్యూనిస్టు ఉద్యమ మహానేత పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సీపీఎం దమ్మపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కార్యాలయం సుందరయ్య భవనంలో సుందరయ్య 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కమిటీ సభ్యుడు పిల్లి నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు యంద్రాతి అప్పారావు సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మాజీ జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డా లక్ష్మీనారాయణ, యంద్రాతి అప్పారావు, పిల్లి నాయుడు మాట్లాడుతూ సుందరయ్య జీవితం నిబద్ధత, నిరాడంబరతకు ప్రతీకగా నిలిచిందన్నారు. వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం పోరాడిన మహానేతగా సుందరయ్య చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. 1936లో వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించి కూలీల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు నడిపారని గుర్తు చేశారు. కుల, మతాలకు అతీతంగా జీవిస్తూ తన పేరులోని కుల సూచక పదాన్ని తొలగించుకుని సమానత్వానికి నిదర్శనంగా నిలిచారని పేర్కొన్నారు.ప్రజల కోసం పోరాడిన గొప్ప విప్లవకారుడు, ఆదర్శ ప్రజాప్రతినిధిగా సుందరయ్య సేవలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని అన్నారు. కార్యక్రమంలో కొప్పుల శ్రీనివాసరావు, రావుల శోభన్ బాబు, కొలికిపోగు శ్రీనివాసరావు, కారం లెనిన్, మోరంపూడి రామమోహనరావు, మోరంపూడి సూర్యనారాయణ, రచెన్నుబోయిన బ్రహ్మయ్య, తంగెళ్లమూడి రమేష్, నారపోగు అనిల్ కుమార్, మోటేపల్లి ధర్మయ్య, హెచ్చు మల్లేశ్వరరావు, జగన్నాథ శ్రీనివాసరావు, రవి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాధనం గాలికి...గుత్తేదారుకు కాసుల వర్షం

- బీటీ రోడ్డు నిర్మాణం నాసిరకం
- పర్యవేక్షణ కొరవడి మూన్నాళ్ళ ముచ్చటవుతున్న రోడ్డు
- సదరు కాంట్రాక్టర్ ను బ్లాక్ లిస్టులో పెట్టాలి
- అధికారుల జాడ ఎక్కడ...?







**మణుగూరు, మే 19 (ప్రజాజ్యోతి):** మణుగూరు మండలం సమితి సింగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధి లోని రాజీవ్ గాంధీ నగర్ లో రూ. 1.20కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణం నాసిరకంగా ఉండడంతో ప్రజాధనం గాలికి, గుత్తేదారుకు కాసుల వర్షం కురుస్తుందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన ఈ పనుల్లో నాణ్యత పూర్తిగా గాలికి వదిలేసి, గుత్తేదారు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### ››› నాణ్యతలేని పనులు - కళ్లముందు సాక్ష్యం

మండలంలోని రాజీవ్ గాంధీ నగర్ రహదారిపై ఇటీవలే వేసిన బీటీ రోడ్డు వారం తిరగకముందే గుంతలు పడుతోంది. కంకర తేలి, తారు లేచిపోయి అడుగడుగునా ప్రమాదాలు పొంచి ఉన్నాయి. రోడ్డు వేసే సమయంలో వాడాల్సిన గుణమట్టం, నీటిపారుదల, రోలింగ్ వంటి కనీస ప్రమాణాలు పాటించలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఒక్క వర్షానికి ఈ రోడ్డు కొట్టుకుపోవడం ఖాయం. ఇది రోడ్డా? లేక తూతూ మంత్రం పనా? అని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు.

### ››› ప్రజాధనం లూటీ - గుత్తేదారుకు కాసుల వర్షం

అంచనా వ్యయం ప్రకారం నాణ్యమైన మెటీరియల్ వాడి, నిర్దేశిత మందంతో రోడ్డు వేయాల్సి ఉండగా గుత్తేదారు తక్కువ ఖర్చుతో పనులు ముగించి లాభపడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. బిల్లుల కోసం మాత్రం పూర్తిస్థాయి అంచనాలు చూపించి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దండుకుంటున్నారని స్థానిక ప్రజా సంఘాలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. పని మాత్రం 40 శాతం, బిల్లు మాత్రం 100 శాతం. ఇదే గుత్తేదారు తీరు అని స్థానికులు మండిపడుతున్నారు. ఆ బీటీ రోడ్డు ద్విచక్ర వాహనదారులకు ప్రాణ సంకటగా మారింది. అధికారుల కనుసన్నల్లోనే గుత్తేదారు ప్రజాధనాన్ని లూటీ చేస్తుంటే కాసులకు కక్కుర్తి పడ్డ అధికారులు కల్లుండి చూడలేని కబోదిలా వ్యవహరిస్తున్నారని పలువురు ముక్కంఠంతో ఆరోపిస్తున్నారు.

### ››› అధికారుల పర్యవేక్షణ ఎక్కడ...?

ఇంత నాసిరకంగా పనులు జరుగుతుంటే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు ఏం చేస్తున్నారని ప్రజలు నిలదీస్తున్నారు. పని ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు, థిక్‌నెస్ చెక్, మెటీరియల్ టెస్టులు లేకుండానే బిల్లులు ఎలా మంజూరు చేస్తున్నారని ప్రశ్నించేవారు లేరు. అధికారులు, గుత్తేదారు కుమ్మక్కయితేనే ఇలాంటి పనులు జరుగుతాయి అనేది స్థానికుల అనుమానం వ్యక్తపరుస్తున్నారు.

### ››› మూన్నాళ్ల ముచ్చటేనా....?

గతంలో కూడా ఈ మండలంలో వేసిన రోడ్లు కొన్ని నెలలకే పాడైపోయిన ఘటనలు ఉన్నాయి. ప్రస్తుత రోడ్డు పరిస్థితి చూస్తుంటే అదే పునరావృతం అవుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. "ప్రభుత్వం కోట్లు ఖర్చుపెడుతుంది కానీ మాకు మిగిలేది మాత్రం గుంతల రోడ్డేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు." ఈ బీటీ రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయేలా ఉందని ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం రోడ్డుపై వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని, థర్డ్ పార్టీ క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీతో రోడ్డు నాణ్యతను పరీక్షించాలని పలువురు మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులైన గుత్తేదారుపై చర్యలు తీసుకుని బ్లాక్ లిస్టులో పెట్టాలని నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం వృధా కాకుండా, రోడ్డును తిరిగి నాణ్యతా ప్రమాణాలతో వేయించాలని జిల్లా కలెక్టర్, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రజలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి.

# జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ ప్రారంభం





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, మే 19, ప్రజా జ్యోతి:** జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్ పరిధిలోని హేమచంద్రపురం పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఆర్మ్డ్ రిజర్వ్ అధికారుల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు కొనసాగనున్న ఈ ప్రాక్టీస్‌లో పోలీస్ శాఖలో వినియోగించే వివిధ రకాల ఆయుధాలతో ఫైరింగ్ శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1469 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఈ వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తున్న పోలీసు సిబ్బంది ఆయుధాల వినియోగంలో నైపుణ్యం పెంపొందించుకోవడం, అత్యవసర పరిస్థితుల్లో సమర్థంగా స్పందించేందుకు ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హేమచంద్రపురంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో విడతల వారీగా జిల్లాలోని ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొననున్నారని అధికారులు వెల్లడించారు.

# ఉపాధి హామీ కార్మికులకు సామాగ్రి పంపిణీ




**పినపాక, మే 19 (ప్రజాజ్యోతి):** బోటిగూడెం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికులకు అవసరమైన సామాగ్రిని సర్పంచ్ నూప బాపనమ్మ, ఉప సర్పంచ్ ధన లక్ష్మి, గ్రామ సెక్రటరీ జ్యోతి, వార్డ్ సభ్యులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధితో పాటు కార్మికుల జీవనోపాధికి తోడ్పాటు అందుతుందని తెలిపారు. కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, కార్మికులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# అంజన్నకు అభిషేకం...రామయ్యకు కల్యాణం



**భద్రాచలం టౌన్ , మే 19 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో ఉన్న దాసాంజనేయస్వామి వారికి మంగళవారం సందర్భంగా ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

# కొనుగోలు చేసిన తప్పని తిప్పలు

- కొనుగోలు చేశారు తీసుకెళ్లడం మరిచారు
- 20 రోజులుగా రైతుల ఎదురుచూపు







**గుండాల మార్చి 19. ప్రజా జ్యోతి** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను అమ్మినప్పటికీ బాధలు తప్పడం లేదు. అమ్మిన ధాన్యాన్ని 20 రోజులుగా కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ 24 న గుండాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్) లో మొక్కజొన్న దాన్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. దీంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్మేందుకు మక్కువ చూపారు బయట వ్యాపారస్తుల వద్ద కింటాకు 1700 నుండి 18 00 రూపాయల కె కొనుగోలు చేస్తుండగా ప్రాథమిక వ్యవసాయ సహకార పర్పస్ సంఘంలో 2400 మద్దతు ధర ఉండడంతో క్వింటాకు 600 రూపాయలు పైగా వ్యత్యాసం ఉండడంతో పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్మేందుకు రైతుల సిద్ధపడుతున్నారు . 180 మంది రైతులకు గాను 13వేల 750 క్వింటాల మొక్కజొన్న ధాన్యాన్ని కొనుగోలు చేయగా, 3 వేల 580 క్వింటాలు మాత్రమే గోదామాలకు తరలించారు పదివేల కింతలకు పైగా ప్రాథమిక వ్యవసాయ సహకార పర్పత్తి సంఘం కేంద్రంలో నిలువలు ఉన్నాయి. సరైన గూడెం లేకపోవడంతో కేంద్రం ముందు ఉన్న స్థలంలో రైతులు విలువలు పెట్టుకొని కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది 20 రోజుల నుండి నిలువలను ఎండకు వానకు కాపాడుకుంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. పిఏసిఎస్ కేంద్రం వద్ద మొక్కజొన్న నిలువలు పెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో మరికొంతమంది రైతులు కేంద్రం వద్దకు రాకుండా ఇంటి వద్దనే ధాన్యాన్ని కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది నిలువలను చూసిన రైతులు అక్కడ ధాన్యాన్ని కాపాడుకోవాల్సిన ఇబ్బందులను చూసి దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది కొనుగోలు చేసిన ధాన్యాన్ని గోడౌన్లకు తరలించేందుకు ఆలస్యం కావడంతో రైతులు అనేక ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని సరైన టైంలో గోడౌన్లకు తరలించినట్లయతే రైతులు మరింతమంది ముందుకొచ్చి ధాన్యాన్ని అమ్ముకునేవారు. కొనుగోలు చేసిన నాటి నుండి అధికారులే బాధ్యత తీసుకుంటే రైతులకు కష్టాలు ఉండేవి కావు, కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని గోడంలకు తరలించినట్లయితే రైతు ఖాతాలో డబ్బులు వచ్చేవి. రైతులు ధాన్యాన్ని అమ్మి 20 రోజుల పైగా అవుతున్నప్పటికీ ధాన్యం గోడంలకు తరలించినట్లయితే రైతు ఖాతాల్లో డబ్బులు జమ ఉండేవి దీంతో మిగతా రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా సొసైటీలోనే అమ్మేందుకు ముందుకు వచ్చేవారు ఇప్పుడు సొసైటీలో వచ్చిన ధాన్యం కొంత రావలసిన దాన్యం మరింత ఉంది అంటున్నారు రైతులు

## పాత విధానంలోనే అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ సమక్షంలో అక్రిడేషన్ కమిటీ ఏకగ్రీవ తీర్మానం




**కొత్తగూడెం కలెక్టరేట్, మే 19(ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన జిల్లా అక్రిడేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నూతన జీవో నెం.252 నిబంధనలు పాత్రికేయులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని కమిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు.సమావేశంలో డిపిఆర్ఓ అజ్గర్ హుస్సేన్ మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం తొలుత పెద్ద పత్రికలకు చెందిన అక్రిడేషన్ కమిటీ సభ్యులతో పాటు నాలుగు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. అయితే దీనిపై స్పందించిన కమిటీ సభ్యులు ఆ ప్రతిపాదనను ఏకగ్రీవంగా తిరస్కరించారు.జిల్లాలోని మండల స్థాయి రిపోర్టర్లకు కూడా అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసిన తర్వాతే తాము కార్డులు స్వీకరిస్తామని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. ప్రస్తుతం తమకు కార్డులు అవసరం లేదని, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరగాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఎం–పానల్ లో ఉన్న ప్రతి పత్రికతో పాటు ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెద్ద పత్రికలకు జిల్లా కేంద్రం, కార్పొరేషన్, భద్రాచలం టెంపుల్ ఏరియా, నియోజకవర్గాలతో పాటు ఎలక్ట్రానిక్ మీడియాకు జిల్లాలో మొత్తం తొమ్మిది కార్డులు, కేబుల్ ఛానళ్లకు కూడా జిల్లా స్థాయి కార్డులు మంజూరు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేసి కలెక్టర్కు అందజేశారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో ఏ జర్నలిస్టుకూ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాత్రికేయులకు సంబంధించిన డిమాండ్లను దరఖాస్తు రూపంలో సమర్పించాలని సూచించారు. అలాగే ఐఎన్‌పీఆర్ కమిషనర్‌తో మాట్లాడి జిల్లాలోని జర్నలిస్టులందరికీ న్యాయం చేసేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.ఈ సమావేశంలో కమిటీ సభ్యులు బి.వి. రమణారెడ్డి, కల్లోజు శ్రీనివాస్, వట్టికొండ రవి, ఎం.ఏ. వాహెద్, జి. వెంకటేశ్వర్లు, మొబగాపు ఆనంద్, మాటేటి మధు, ఎండి. యాకుబ్ పాషా, నాగ చంద్ర, ప్రశాంత్ పాల్గొన్నారు.

## సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం

- సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు



**భద్రాచలం టౌన్, మే 19 ప్రజాజ్యోతి** వర్గ పోరాటాలు సామాజిక పోరాటాలు సాగించడమే సుందరయ్యకు మనమిచ్చే ఘన నివాళి అని సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ జీవి అమరజీవి కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సభ మంగళవారం పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య తన కుటుంబం నుండి వర్గ,సామాజిక పోరాటం ప్రారంభించారని అన్నారు. మూడ ఆచారాలకు, నమ్మకాలకు వ్యతిరేకంగా కృషి చేశారని, బహుముఖ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పార్టీ నిర్మాణానికి కృషి చేశారని గుర్తు చేశారు. యువత విప్లవ రాజకీయాల వైపు ఆలోచించాలని ఆదర్శవంతమైన రాజకీయాలు కమ్యూనిస్టులతోనే సాధ్యమని తెలిపారు. దేశంలో బీజేపీ రాజకీయ కుట్రల ద్వారా, ఎలక్షన్ కమిషన్, ఈ డి, సిబిఐ మొదలగు రాజ్యాంగ యంత్రాంగాన్ని ఉపయోగించుకొని అధికారం లోకి వస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, బండారు శరత్ బాబు, వై.వెంకట రామారావు, డి.సీతా లక్ష్మి , వార్డు సభ్యులు ఇర్పా అనసూయ, నాదెళ్ల లీలావతి, నకిరికంటి నాగ రాజు, చుక్క మాధవరావు పాల్గొన్నారు.

# అపరిశుభ్రంగా మరుగుదొడ్లు!

- సింగరేణి వైద్యశాల మరుగుదొడ్లలో శుభ్రత పాటించరా?
- పిచ్చి చెట్లు పెరిగి ఇబ్బందులు పడుతున్న వైనం
- దుర్వాసన వస్తున్న మరుగుదొడ్లు?
- అధికారులు జర పట్టించుకోరూ!







**ఇల్లందు, మే 19, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికుల ఆరోగ్యం పట్ల యాజమాన్యం ఎన్నో రకాల జాగ్రత్తలను పాటిస్తూ వస్తుంది. విధుల్లో ఉన్న కార్మికులకు ఇలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం వాస్తవం. కానీ సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది, వైద్యశాలకు వచ్చే రోగుల కోసం ఏర్పాటుచేసిన పురుషుల మరుగుదొడ్లు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. ఆ మరుగుదొడ్లకు వెళ్లాలంటేనే ఇటు సిబ్బంది... అటు రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని కండ్లకు కనిపిస్తుంది. ముఖ్యంగా ఈ మరుగుదొడ్లను శుభ్రం చేయాల్సిన స్కావెంజర్ ఏమి చేస్తుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విధులకు వచ్చామా.. వెళ్ళామా అనే రీతిలోనే సదరు స్కావెంజర్ ఉంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అంతేకాకుండా పురుషుల మరుగుదొడ్లకు వెళ్లే మార్గంతో పాటు చుట్టుపక్కల పిచ్చి మొక్కలు పెరగడంతో ఏవైనా విషపు సర్పాలు, పురుగులు సంచరిస్తున్నయన్నా భయంతో అటు వెళ్లేందుకు సిబ్బంది, రోగులు జంకుతున్నట్లు తెలుస్తుంది. కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పుకునే సింగరేణి యాజమాన్యానికి ఇల్లందు ఏరియా ఆసుపత్రిలో దుర్వాసన, భయానక పరిస్థితులు నెలకొన్న వాస్తవాలు కనిపించడం లేదా అని కార్మికులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులతో పాటు ఇల్లందు ఏరియా ఉన్నతాధికారులు స్పందించి సింగరేణి ఇల్లందు ఏరియా ఆసుపత్రిలో పురుషుల మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, దుర్వాసన రాకుండా శుభ్రత పాటించాలని, పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.

## ప్రజలు సహకరించండి... శాంతి భద్రతలు కాపాడుతాం

- నూతన ఎస్సైగా శ్రావణ్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



**గుండాల మార్చి 19. ప్రజా జ్యోతి.** ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ సహకరించాలని తద్వారా శాంతి భద్రతలు కాపాడుతామని బాధ్యతలు స్వీకరించిన ఎస్సై ఎం శ్రవణ్ కుమార్ అన్నారు, మంగళవారం బాధ్యతలు స్వీకరించిన చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు మణుగూరు నుండి గుండాల కు బదిలీపై రాగా గుండాల లో పనిచేసిన ఎస్సై రహూఫ్ మణుగూరుకు బదిలీపై వెళ్లారు.

## ట్రైబల్ మ్యూజియం సందర్శించిన గిరి దర్శక్ బృందం



**భద్రాచలం టౌన్ , మే 19 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను గిరిదర్శక్ శిక్షణ పొందుతున్న గిరిదర్శక్ బృందం టూరిసెట్ గైడ్ సభ్యులు మంగళవారం సందర్శించారు. కొత్తగూడెం జిల్లా హెడ్ క్వార్టర్ లో పౌర రక్షక శాఖ ఆధ్వర్యంలో గిరిదర్శక్ శిక్షణ పొందుతున్న గిరిదర్శక్ బృందం టూరిస్ట్ గైడ్ సభ్యులు శిక్షణలో భాగంగా గిరిజన మ్యూజియంను సందర్శించి మ్యూజియంలోని ఆదివాసీలకు సంబంధించిన సంస్కృతి సాంప్రదాయాలను మరియు కళాకృతులను పరిశీలించారు. అలాగే గిరిజన క్రాఫ్ట్ తయారీ విధానాన్ని వారు పరిశీలించినారు. మారుమూల ఆదివాసి గిరిజనుల యొక్క పురాతన వస్తువులను సేకరించి ఆదివాసీల సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భావితరాలకు తెలిసే విధంగా మ్యూజియంలో పొందుపరచడం చాలా బాగుందని ఆనందం వ్యక్తం చేశారు. ఆహార సేకరణకు ఉపయోగించే వస్తువులు మరియు నీళ్లకు ఉపయోగించే సొరకాయతో చేసినటువంటి సొరకాయ బుర్రలు బాగున్నాయని, ఆదివాసులు ఆధునిక పోకడలకు పోకుండా పర్యావరణాన్ని కాపాడే వస్తువులను నిత్యజీవితంలో ఉపయోగించుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, మాధవి, స్రవంతి, సందీప్ కుమార్, ఉదయ్ కుమార్, రవి, ముత్యాలరావు, దేవా, వర్ష సందీప్, అపక సాంబ పాల్గొన్నారు.

## కంప్యూటర్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

- రాహుల్ విజ్ఞాన్ లో ఉచిత శిక్షణ ముగింపు
- మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి: ఎంఈఓ రమణ





**చర్ల, మే 19 :(ప్రజా జ్యోతి ):** నేటి ఆధునిక డిజిటల్ యుగంలో విద్యార్థులకు కంప్యూటర్ విద్య, మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఎంతో అవసరమని, ఇవే వారి భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని చర్ల మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) పరిటాల వెంకటరమణ అన్నారు. చర్ల మండల కేంద్రం లోని స్థానిక రాహుల్ విజ్ఞాన్ విద్యాలయంలో గత ఏప్రిల్ 26 నుంచి నిర్వహిస్తున్న ఉచిత వేసవి కంప్యూటర్ శిక్షణ , కుట్టు శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులు, మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఎంఈఓ పరిటాల వెంకటరమణ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం విలాసం కాదని, ప్రతి విద్యార్థికి కనీస అవసరంగా మారిందని పేర్కొన్నారు. సాంకేతిక విద్యను అందిపుచ్చుకున్న వారికే భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు లభిస్తాయని తెలిపారు.విద్యార్థులకు కంప్యూటర్ బేసిక్స్, ఎంఎస్ ఆఫీస్, పవర్ పాయింట్ వంటి అంశాలతో పాటు ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ ) పై కూడా ప్రాథమిక అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ తరహా శిక్షణలు ఎంతో ఉపయోగకరమని, ఇవి వారి ఉన్నత విద్యాభ్యాసం , భవిష్యత్ కెరీర్ కు దోహదపడతాయని అన్నారు.అదేవిధంగా మహిళలు ఆర్థికంగా ఎదగడానికి కుట్టు శిక్షణ ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. ఉచితంగా అందిస్తున్న ఈ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొంది తమ కాళ్లపై తాము నిలబడటమే కాకుండా కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవొచ్చని తెలిపారు. మహిళల సాధికారతకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు.చర్ల వంటి వెనుకబడిన ప్రాంతంలో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఆధునిక కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాన్ని కల్పించి, వేసవి సెలవులను సద్వినియోగం చేస్తూ ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ విజ్ఞాన్ విద్యాలయం యాజమాన్యం డాక్టర్ డి.ఎన్. కుమార్ దంపతులను ప్రత్యేకంగా అభినందించారు.పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాత్రి వేళ కొత్తగూడెంలో ఆటో డ్రైవర్ల ఆగడాలు

- అధిక చార్జీలతో రాత్రి వేళ నిలువు దోపిడీ
- రాత్రి ట్రైన్ సమయంలో వచ్చి వెళ్లే ప్రయాణికు లకు చుక్కలు చూపి స్తున్న ఆటో డ్రైవర్లు
- అధిక ఛార్జిల వసూళ్లపై రవాణా శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా చర్యలు చేపట్టాలని ప్రజల డిమాండ్




**కొత్తగూడెం, మే 19 (ప్రజాజ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో రాత్రి వేళ ఆటో డ్రైవర్ల అధిక చార్జీల వసూళ్లు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ముఖ్యంగా భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌కు రాత్రి వేళల్లో చేరుకునే ప్రయాణికులు ఆటో డ్రైవర్ల వ్యవహారంతో ఆందోళనకు గురవుతున్నారు. రాత్రి 10 గంటలు దాటిన తర్వాత పరిస్థితి పూర్తిగా అదుపు తప్పుతోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతి రోజు సింగరేణి రైలు, కాకతీయ ఎక్స్‌ప్రెస్‌తో పాటు తెల్లవారుజామున మణుగూరు సూపర్ ఫాస్ట్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రైళ్ల ద్వారా జిల్లాకు చేరుకునే ప్రయాణికులు రైల్వే స్టేషన్ వెలుపల ఆటో డ్రైవర్ల అధిక చార్జీల బారిన పడుతున్నారు. కేవలం రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరానికే రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాల్వంచ, భద్రాచలం, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, రుద్రంపూర్, రామవరం, కొత్తగూడెం పట్టణ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల నుంచి మరింత అధికంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**››› ప్రయాణికులను బెదిరిస్తున్నారనే ఆరోపణలు**

ఒక ఆటో డ్రైవర్ చెప్పిన ధర ఎక్కువగా ఉందని భావించి మరో ఆటోను మాట్లాడుకునేందుకు ప్రయత్నించిన ప్రయాణికులను కొందరు డ్రైవర్లు అడ్డుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఇక్కడ మా రేటే ఫిక్స్ అంటూ ప్రయాణికులను బెదిరింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. బయట ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులు స్థానిక ప్రాంతంపై అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ఆటో డ్రైవర్లు అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన మహిళలు, వృద్ధులు, చిన్నారులతో ఉన్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన అవసరం ఉండటంతో డ్రైవర్లు చెప్పినంత మొత్తాన్ని చెల్లించక తప్పని పరిస్థితి నెలకొంటోంది. దీంతో సాధారణ ప్రజల్లో అసహనం పెరుగుతోంది.

**››› నిర్దిష్ట చార్జీలు అమలు చేయాలని డిమాండ్**

కొత్తగూడెం పట్టణంలో ఆటోలకు నిర్దిష్ట చార్జీలు అమలు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైల్వే స్టేషన్ వద్ద పోలీస్ పర్యవేక్షణ పెంచడంతో పాటు రేట్ల పట్టికను స్పష్టంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇప్పటికే ప్రయాణికుల నిస్సహాయ స్థితిని అడ్డం పెట్టుకుని బెదిరింపులకు పాల్పడుతున్న పరిస్థితి కొనసాగితే ప్రజలు ఆటోలపై నమ్మకం కోల్పోయి ప్రత్యామ్నాయ రవాణా మార్గాలను ఆశ్రయించే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఆటో డ్రైవర్లు కూడా ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి న్యాయమైన చార్జీలు వసూలు చేస్తేనే వృత్తిపై విశ్వాసం కొనసాగుతుందని స్థానికులు సూచిస్తున్నారు. సమస్య తీవ్రరూపం దాల్చకముందే రవాణా శాఖ, పోలీస్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## పారిశ్రామికవాడను అభివృద్ధి చేయడమే లక్ష్యం

- రూ.85లక్షలతో సీసీ రోడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం



**బూర్గంపహాడ్, మే 19 (ప్రజా జ్యోతి ):** పారిశ్రామిక వాడ సారపాకను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సారపాక పంచాయతీలోని గాంధీనగర్, భాస్కర్ నగర్ లో రూ.85 లక్షలతో నూతనంగా నిర్మించిన 17 సీసీ రోడ్లను సర్పంచ్ కిషోర్ నాయక్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చుతూ అభివృద్ధి చేస్తున్నామన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన భూక్యా అరుణ, తేజావత్ జానకి లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు ఆయన గృహప్రవేశం చేశారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యానికి గురైన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి నివాసానికి వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, తహశీల్దార్ కేఆర్కే.ప్రసాద్, పీఆర్ డీఈ పొదెం వెంకటేశ్వరరావు, ఈఏ చక్రధరా చారి, సర్పంచ్ మందా నాగరాజు, నాయకులు కైపు శ్రీనివాసరెడ్డి, భజన సతీష్, భజన ప్రసాద్, మహిమూదఖాన్, మారం వెంకటేశ్వరరెడ్డి, వారాల వేణు, చంటి, బాలి శ్రీహరి, చల్లా వెంకటనారాయణ, పూలపెల్లి సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీవో



**చర్ల, మే 19 :(ప్రజా జ్యోతి):** చర్ల మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న పనులను ఏపీవో సాంబశివరావు మంగళవారం సందర్శించి పరిశీలించారు. గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న చెరువు పూడికతీత పనులను ప్రత్యక్షంగా పరిశీలించి కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.లింగాపురం గ్రామపంచాయతీ ప్రజలు, కొత్తపల్లి గ్రామస్తులు కలిసి కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చెరువులో పూడికతీత పనులు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ అధ్యక్షుడు ముసలి సతీష్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు ప్రభుత్వం తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీల వేతనాలు సరిపోవడం లేదని, వెంటనే వేతనాలను పెంచాలని కోరారు. అలాగే పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స, చిన్నపిల్లల సంరక్షణ వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.చెరువులో పూడికతీత చేపట్టడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు, గ్రామ ప్రజలకు ఉపయోగకరంగా మారుతుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.ఉపాధి హామీ పనులు గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు ఉపాధి కల్పించడమే కాకుండా గ్రామాభివృద్ధికి కూడా దోహదపడుతున్నాయని పలువురు పేర్కొన్నారు. పనులు మరింత సమర్థవంతంగా కొనసాగేందుకు అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాలని కూలీలు కోరారు.

## చీమలపాడులో జన్ భాగిదారి హెల్త్ క్యాంప్

**చర్ల , మే 19 :(ప్రజా జ్యోతి ):** దూర ప్రాంత గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఐ టి డి ఏ భద్రాచలం ఆధ్వర్యంలో "జన్ భాగిదారి – సబ్సే దూర్, సబ్సే పెహ్లే" కార్యక్రమంలో భాగంగా చీమలపాడు గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పీ ఏం –జన్ మన్ & డి ఏ –జె జి యు ఏ పథకాల కింద ఏర్పాటు చేసిన ఈ హెల్త్ క్యాంప్‌కు గ్రామ గిరిజనులు పెద్ద ఎత్తున హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది గిరిజనులకు సికిల్ సెల్ ఎనీమియా, రక్తపోటు, మధుమేహం (షుగర్), క్షయవ్యాధి (టి బి ) తదితర వ్యాధులకు ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. అలాగే తలసేమియా, అసంక్రమిత వ్యాధులు (యెన్ సి డి ఎస్ ), సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం వంటి అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, పరిశుభ్రత పాటించడం, సమయానికి వైద్యులను సంప్రదించడం వంటి విషయాలపై ప్రజలకు సూచనలు చేశారు.ఈ సందర్భగా డాక్టర్ హారిక మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఆశయానికి అనుగుణంగా గిరిజనులకు ఆరోగ్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామీణ, అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. మే 25 వరకు గుర్తించిన అన్ని గిరిజన గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలు కొనసాగనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రామలక్ష్మి , హెల్త్ సూపర్‌వైజర్ రామ్ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, హెల్త్ అసిస్టెంట్లు హేమావతి, ధర్మారావు, సౌజన్య, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## కొనుగోలు చేసిన మొక్కజొన్న ధాన్యాన్ని గోడౌన్లకు తరలించాలి

- న్యూ డెమొక్రసీ.





**గుండాల. మార్చి 19 (ప్రజాజ్యోతి)** కొనుగోలు చేసిన మొక్కజొన్న ధాన్యాన్ని గోడౌన్ లోకి తరలించి రైతు ఖాతాలకు డబ్బులు చెల్లించాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ముందు రాస్తారోకో నిర్వహించి ధర్నా చేశారు ధర్నాను ఉద్దేశించి ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఆవుదునూరి మధు, కోరం సీతారాములు, బచ్చలి సారయ్యలు మాట్లాడారు ఇల్లందు గుండాల రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తుండగా తాసిల్దార్ ఖాసీం గుండాల ఎస్సై శ్రావణ్ కుమార్ చేరుకొని అధికారులతో మాట్లాడారు అనంతరం వారిని రాస్తారోకో నుండి వెను తిరగాలని రేపటి నుంచి లారీలు తరలించేందుకు వస్తాయని హామీ ఇచ్చారు అనంతరం ధర్నాను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రంలో నమ్మిన నెల రోజులుగా ధాన్యాన్ని కాపాడేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారం రోజుల క్రితం వర్షం వచ్చి ధాన్యం తడిసిందని ఆయన అధికారులు చెల్లించలేదని విమర్శించారు ధాన్యాన్ని గోడౌన్లకు తరలించి రైతు ఖాతాల్లో డబ్బులు వెంటనే వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పెండేకట్ల పెంటన్న, యాసారపు వెంకన్న, గడ్డం లాలయ్య, మానాల ఉపేందర్, అర్ ఎం నరేష్ ఈసం కృష్ణ బుక్య వెంకన్న పాయం ఎల్లన్న పూణెం నరసన్న గొగ్గల శీను నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్లపై దాడులు ఆందోళనకరం

- దమ్మపేట పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీ ఆగ్రహం



**దమ్మపేట, మే. 19(ప్రజాజ్యోతి):** పాస్టర్లు, క్రైస్తవులపై జరుగుతున్న మతపరమైన దాడులను అరికట్టాలని బహుజన దమ్మపేట మండల పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని చిన్న గొల్లగూడెంలో పాస్టర్ జెకర్యా ప్రార్థనా మందిర ఆవరణంలో మంగళవారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఈ మేరకు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల పాడేరు నియోజకవర్గంలో పాస్టర్ అభినయ దర్శన్‌పై కారం చల్లి, కత్తులతో దాడి చేసిన ఘటనను సమావేశంలో తీవ్రంగా ఖండించారు. మత చాంధస్సువాదుల దుశ్చర్యలను ప్రభుత్వం ఉపేక్షించకూడదని కోరారు.ఈ సందర్భంగా బండారు జాన్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వం కలిగిన దేశంలో మత విద్వేషాలు పెరగడం దురదృష్టకరమన్నారు. రమేష్ జాషువా మాట్లాడుతూ మతపరమైన దాడులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్రైస్తవ సమాజానికి రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. సమాజంలో శాంతి, సామరస్యాల కోసం పాస్టర్లు నిరంతరం కృషి చేస్తుంటారని, వారిపై దాడులు జరగడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.సమావేశంలో ఫెలోషిప్ అధ్యక్షుడు సెబాస్టియన్, సెక్రటరీ క్రాంతి కుమార్, దైవ ప్రసాద్, యేసురత్నం, లారెన్స్, తిమోతి, జెకర్యా, ఇశ్రాయేలు, మార్క్ రాజు, రాధాకృష్ణ, నతానియేలు, తితుకు, బోయజు, రాజేంద్ర ప్రసాద్, రమణ, యోసేపు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు జీలుగుల పంపిణీ ప్రారంభం

- గుంపెన సహకార సంఘంలో కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులు





**అన్నపురెడ్డిపల్లి, మే 19, (ప్రజాజ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల గుంపెన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మంగళవారం రైతులకు జీలుగుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట డివిజన్ ఏడిఏ రవికుమార్, మండల వ్యవసాయ అధికారి జి అనూష పాల్గొని రైతులకు జీలుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులు సాగులో నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు వినియోగించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులకు అవసరమైన వ్యవసాయ సామగ్రిని సహకార సంఘాల ద్వారా అందించడం వల్ల వారికి ఆర్థిక భారం తగ్గుతుందన్నారు. రైతులు సకాలంలో సాగు పనులకు సిద్ధం కావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు పాటిస్తే ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు వినియోగంలో వ్యవసాయ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గుంపెన సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన వ్యవసాయ సామగ్రిని అందుబాటులో ఉంచుతున్నామని సొసైటీ చైర్మన్ బోయినపల్లి సుధాకర్ రావు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగు పనులు ప్రారంభించేందుకు సంఘం తరపున అవసరమైన సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను వినియోగించుకుని వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం సెక్రటరీ కె శ్రీనివాస్ రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### తాజాపై మాజీ విమర్శలవిల్లు

### భద్రాచలం ఎమ్మెల్యే నేనే అంటూ వ్యాఖ్యలు



# భద్రాద్రిలో... పొలిటికల్ వార్

**భద్రాద్రి రాజకీయాలు మరోసారి వేడెక్కుతున్నాయి. ఇంతకాలం ముసుగులో సాగిన అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగ రాజకీయ సమరానికి దారితీస్తున్నాయి. అధికార పార్టీ జెండా కింద నడుస్తున్న నాయకులు ఇప్పుడు ఒకరిపై ఒకరు మాటల బాణాలు సంధిస్తుండటంతో భద్రాచలం రాజకీయ వాతావరణం హాట్ హాట్‌గా మారింది. "ఒకే చెట్టుకు రెండు కొమ్మలు" అన్నట్టుగా ఇరువురు నేతల మధ్య ఆధిపత్య పోరు స్పష్టంగా బయటపడుతోంది. మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి.**

- భద్రాచలం, ప్రజాజ్యోతి

"భద్రాచలం ఎమ్మెల్యే నేనే.. ప్రజల ఆశీస్సులు నాకే ఉన్నాయి" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు స్థానిక రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపుతున్నాయి. "పార్టీపై నాకు కూడా అంతే హక్కు ఉంది" అంటూ చేసిన వ్యాఖ్యలు కార్యకర్తల్లోనూ చర్చనీయాంశమయ్యాయి. గత ఎన్నికల ఓటమిపై కూడా వీరయ్య పరోక్ష అసంతృప్తి వ్యక్తం చేశారు. "బయటి వాళ్ల కంటే ఇంటి వాళ్లే ఎక్కువ నష్టం చేశారు" అన్న ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా మరింత దుమారం రేపుతున్నాయి. "చెట్టు నాటింది ఒకరు..నీళ్లు పోసింది మరొకరు.. ఫలాలు మాత్రం ఇంకొకరు తీసుకెళ్లారు" అన్నట్టుగా పార్టీ కోసం కష్టపడిన అసలు కార్యకర్తలకు గుర్తింపు దక్కడం లేదన్న భావనను ఆయన మాటల్లో స్పష్టంగా కనిపించిందని రాజకీయ పరిశీలకులు



అంటున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై కూడా వీరయ్య పరోక్ష విమర్శలు గుప్పించారు. "ప్రజల మధ్య ఉండే నాయకత్వమే నిలుస్తుంది.. కేవలం పదవులు శాశ్వతం కావు" అంటూ వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. "కుర్చీ కోసం కాదు.. కష్టాల్లో ఉన్న కార్యకర్త కోసం నిలబడే నాయకత్వం కావాలి" అన్న వ్యాఖ్యలు కూడా వర్గపోరుకు మరింత ఆజ్యం పోశాయి. భద్రాచలం రాజకీయాల్లో ప్రస్తుతం రెండు వర్గాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్థానిక కార్యకర్తలే చెబుతున్నారు. ఒకవైపు మాజీ ఎమ్మెల్యే అనుచరులు, మరోవైపు ప్రస్తుత ఎమ్మెల్యే వర్గం మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని అంటున్నారు. పార్టీ కార్యక్రమాల్లో కూడా ఈ విభేదాల ప్రభావం బయటపడుతోందన్న చర్చ సాగుతోంది. భద్రాద్రి రాజకీయాల్లో వ్యక్తిగత ఇమేజ్, కార్యకర్తల బలం, ప్రజలతో అనుబంధం కీలక పాత్ర పోషిస్తుంటాయి. అలాంటి నియోజకవర్గంలో ఒకే పార్టీకి చెందిన ఇద్దరు బలమైన నాయకులు ఒకరిపై ఒకరు బహిరంగ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. "ఒక గూటిలో రెండు కత్తులు ఇమడవు" అన్నట్టుగా పరిస్థితులు మారుతున్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పటివరకు అంతర్గతంగానే ఉన్న అసంతృప్తి ఇప్పుడు బహిరంగస్థాయికి రావడంతో రానున్న రోజుల్లో భద్రాచలం రాజకీయాలు మరింత రసవత్తరంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ వర్గపోరు కేవలం మాటల యుద్ధంగానే ముగుస్తుందా.. లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## పుల్లాయిగూడెంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహణ

- సర్పంచ్ పూనెం సూరమ్మ చేతుల మీదుగా ప్రారంభం.
- – గ్రామ ప్రజలకు వైద్య సేవలు, మందుల పంపిణీ.

**పాల్వంచ, మే 19, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలం పుల్లాయిగూడెం గ్రామ పంచాయతీలో ఆది కర్మయోగి ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పూనెం సూరమ్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్యాంపులో గ్రామ ప్రజలకు రక్తపోటు, షుగర్, జ్వరాలు, గుండె సంబంధిత వ్యాధులపై వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వీ సడాలు దేవి, ఎంఎల్‌హెచ్‌పీ ఈశ్వరి, ఎల్‌టీఎస్ శంకర్, ఏఎన్ఎమ్ రామ



దేవి, ఆశా వర్కర్ కోరెం యశోద, పంచాయితీ కార్యదర్శి మధు పాల్గొన్నారు. గ్రామ మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలను వినియోగించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోలీసులకు అమిత్ షా సన్మానం

- నక్సల్స్ రహిత తెలంగాణకు కేంద్ర ప్రశంస
- తెలంగాణ పోలీసుల కృషిని మెచ్చిన కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా



**చర్ల, మే 19:(ప్రజా జ్యోతి ):** నక్సలిజాన్ని పూర్తిగా అణిచివేసి తెలంగాణను నక్సల్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఘనంగా సన్మానించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్పూర్ లో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ సన్మాన కార్యక్రమం జరిగింది.తెలంగాణ రాష్ట్రంలో నక్సలిజం నిర్మూలన కోసం తెలంగాణ పోలీసులు చేపట్టిన వ్యూహాత్మక చర్యలు, సమర్థవంతమైన ఆపరేషన్లు, గూఢచారి వ్యవస్థ బలోపేతం, ప్రజల సహకారంతో చేపట్టిన చర్యలు రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎంతో దోహదపడ్డాయని ఈ సందర్భంగా కేంద్ర హోంమంత్రి ప్రశంసించారు. తెలంగాణ పోలీసు విభాగం చూపిన కట్టుదిట్టమైన ప్రణాళికలు, సమన్వయంతో నక్సలిజాన్ని పూర్తిగా అణచివేయడంలో విజయం సాధించిందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ డీజీపీ సి .వి . ఆనంద్ , రాష్ట్ర భద్రతా సలహాదారు బి . శివధర్ రెడ్డి , డీజీపీ ఆపరేషన్స్ డాక్టర్ అనిల్ కుమార్ , మల్కన్‌గిరి కమిషనర్, మాజీ ఎస్ఐబీ డీజీపీ సుమతి తో పాటు ఆమె బృంద సభ్యులను ప్రత్యేకంగా సన్మానించారు.నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు అధికారులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తిస్తూ శాంతి భద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశారని అమిత్ షా కొనియాడారు. తెలంగాణ పోలీసుల సేవలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం తెలంగాణ పోలీసు విభాగానికి గర్వకారణంగా నిలవడంతో పాటు, నక్సలిజం నిర్మూలనలో పోలీసు శాఖ చేసిన కృషికి గుర్తింపుగా భావిస్తున్నారు.

# సుందరయ్య స్ఫూర్తితో పోరాడాలి

- ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి



**చర్ల, మే 19 :(ప్రజా జ్యోతి ):** శ్రామిక వర్గ రాజ్య స్థాపన కోసం జీవితాంతం పోరాడిన గొప్ప విప్లవ నేత అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చర్లలోని సీపీఎం కార్యాలయంలో సుందరయ్య 41వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నేతలు ఘన నివాళులర్పించారు. అనంతరం సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. బందెల చంటి అధ్యక్షతన నిర్వహించిన సభలో రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ, దోపిడీ లేని సమసమాజ నిర్మాణం కోసం సుందరయ్య అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు.స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా దేశంలో పేదరికం పెరుగుతుండటంతో పేదల హక్కుల సాధన కోసం 1936లో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘాన్ని స్థాపించారని తెలిపారు. నిరాడంబర ప్రజా ప్రతినిధిగా, ఆదర్శ నాయకుడిగా సుందరయ్య దేశానికి విశేష సేవలు అందించారని అన్నారు.తెలంగాణ ప్రాంతంలో నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం నిర్వహించి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచిపెట్టడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నేటి తరం సుందరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని మతతత్వ, కార్పొరేట్ శక్తుల నుండి దేశాన్ని కాపాడేందుకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు పొడుపుగంటి సమ్మక్క, బందెల చంటి, దొడ్డి హరినాగవర్మ, ఉడుగుల షారోని, వరదల వరలక్ష్మి , తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షులు శ్యామల వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి నల్లగట్ల మూర్తి, కట్టం స్పందన, నర్సయ్య, సూరిబాబు, ముత్తయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె బాటలో కెమిస్టులు

- దేశవ్యాప్తంగా నేడు మెడికల్ షాప్స్ బంద్
- ఆన్‌లైన్ మందుల విక్రయాలకు వ్యతిరేకంగా కెమిస్టుల సమ్మె
- సమ్మెకు మద్దతుగా తెలంగాణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కెమిస్టుల సంఘాలు

**చర్ల , మే 19 (ప్రజా జ్యోతి ):** అఖిల భారత కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ సంస్థ పిలుపు మేరకు ఈ నెల 20వ తేదీ బుధవారం దేశవ్యాప్తంగా కెమిస్టులు, ఔషధ దుకాణాల నిర్వాహకులు సమ్మె నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొన్ని విధానాలపై నిరసన వ్యక్తం చేస్తూ ఈ సమ్మె చేపడుతున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా చర్ల మండలంలో మంగళవారం మండలంలోని మందుల షాపు దుకాణదారులు బుధవారం జరగబోయే దేశవ్యాప్త మెడికల్ షాప్స్ బందుకు సంబంధించిన మెమోరాండం మండల తాసిల్దార్ శ్రీనివాస్ కి, చర్ల మండల సీఐ రాజు వర్మకి ఇవ్వడం జరిగింది.ఈ సమ్మెలో ప్రధానంగా ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని, కార్పొరేట్ సంస్థలు భారీ డిస్కౌంట్ల పేరుతో చిన్న మెడికల్ షాపులపై చూపుతున్న ప్రభావాన్ని అరికట్టాలని, నకిలీ మందుల విక్రయాలను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే 28-08-2018 నాటి జి ఎస్ ఆర్ 817, 26-03-2020 నాటి జి ఎస్ ఆర్ 220 ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని సంఘ నాయకులు కోరుతున్నారు.ఆన్‌లైన్ మందుల విక్రయాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న మెడికల్ షాపులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నాయని, కార్పొరేట్ కంపెనీలు భారీ రాయితీలతో వ్యాపారాన్ని ఆక్రమిస్తున్నాయని సంఘ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సరైన నియంత్రణ లేకుండా ఆన్‌లైన్ ద్వారా మందులు విక్రయించడం వల్ల ప్రజల ఆరోగ్యానికి కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు.నకిలీ మందుల విక్రయాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరారు. మెడికల్ రంగాన్ని రక్షించేందుకు ఈ సమ్మె అవసరమైందని తెలిపారు.ఈ సమ్మెకు తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్, భద్రాచలం డివిజన్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ పూర్తి మద్దతు ప్రకటించాయి.తెలంగాణ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తోడుపునూరి రాజు, ఖజాంచి పెండెం కృష్ణ కుమార్ సమ్మెను విజయవంతం చేయాలని సభ్యులకు పిలుపునిచ్చారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంఘ అధ్యక్షుడు వి. తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి కంబంపాటి రవి, ఖజాంచి ఎ. లక్ష్మణాచారి, భద్రాచలం డివిజన్ సంఘ అధ్యక్షుడు పి. సోమశేఖర్, ప్రధాన కార్యదర్శి చి. నాగేశ్వరరావు, ఖజాంచి జి. మురళీమోహన్ సమ్మెలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.సమ్మె కారణంగా రోగులకు, ప్రజలకు కలిగే అసౌకర్యానికి క్షమాపణలు తెలుపుతూ ప్రజలు సహకరించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.



# నాయి బ్రాహ్మణ విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు

- నాయి బ్రాహ్మణ కమిటీ ఆధ్వర్యంలో సన్మానం



**చర్ల, మే 19 :(ప్రజా జ్యోతి ):** చర్ల నాయి బ్రాహ్మణ మండల కమిటీ ఆధ్వర్యంలో పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన నాయి బ్రాహ్మణ విద్యార్థులకు మంగళవారం చిరు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నాయకుల చేతుల మీదుగా విద్యార్థులను ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదివి పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన పడకలపల్లి ప్రదీప్, ముక్కాల నిషి, కుమ్మరికుంట్ల తనుజ్, విదులూరి భువనరేఖలను పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని సమాజంలో మంచి స్థానం సంపాదించాలని నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మాధవరావు, మండల గౌరవ సలహాదారుడు శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు రమణ, మండల కోశాధికారి చక్రవర్తి శ్రీనివాస్, సీనియర్ నాయకులు రాంబాబు, ఫిలిప్స్ ప్రసాద్, రమేష్, గౌరయ్య, సుకన్య తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, నాయి బ్రాహ్మణ కుటుంబ సభ్యులు కూడా హాజరై ఆనందం వ్యక్తం చేశారు.

# గురుదేవ్ విద్యార్థినికి రాష్ట్రంలో 18వ ర్యాంకు



**చర్ల, మే 19 :(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని గురుదేవ్ విద్యాలయం విద్యార్థిని, బి.సంపత్ కుమార్తె బి. మాధురి టి జి ఆర్ జె సి –2026 ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 18వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. మాధురి సాధించిన ఈ అద్భుత విజయంతో గురుదేవ్ విద్యాలయానికి మాత్రమే కాకుండా చర్ల ప్రాంతానికే మంచి గుర్తింపు తీసుకువచ్చిందని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. క్రమశిక్షణతో కూడిన చదువు, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం మరియు తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించింది. అలాగే మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ రమణ , గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పలువురు ప్రముఖులు విద్యార్థినికి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వదించారు.విద్యార్థిని విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, సహకరించిన తల్లిదండ్రులను కూడా పాఠశాల యాజమాన్యం అభినందించింది. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం ఉంటే రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరచగలరని ఈ విజయం మరోసారి నిరూపించిందని పలువురు అభిప్రాయపడ్డారు.

# వైభవంగా సీతారాముల కల్యాణం

- భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం





**చర్ల, మే 19:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని శ్రీ సీతారామ లక్ష్మణ భక్తాంజనేయ స్వామి వారి ఆలయంలో నాలుగో వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రత్యేక అలంకరణల మధ్య వేద పండితుల మంత్రోచ్చారణలతో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని దర్శించేందుకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన దాత లు దొడ్డి రామకృష్ణ–జ్యోతి దంపతులు, చిప్ప శ్రీనివాసరావు–సత్యవాణి దంపతులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆల య వార్షికోత్సవాలను మరింత ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మచ్చ వీర్రాజు, అయ్యంగిరి నాగేశ్వరరావు, నాంపల్లి సాగర్, కోటి రమేష్, చింతూరి వినోద్, ఎడారి శ్రీను పాల్గొన్నారు.

**ఉదయం వెలుగు పుట్టకముందే రోడ్డెక్కే మనిషి... అర్ధరాత్రి దాటినా "ఇంకో బేరం వస్తుందేమో" అని ఆటో స్టాండ్ దగ్గరే ఆశగా ఎదురు చూసే జీవితం... మండే ఎండ చర్మాన్ని కాల్చినా, కుండపోత వాన శరీరాన్ని తడిపినా, జ్వరం ఒళ్లు మండించినా, కడుపులో అన్నం లేకున్నా స్టీరింగ్ వదలని బతుకు... అదే ఆటో డ్రైవర్ జీవితం. ప్రజల గమ్యాలను చేరుస్తూ రోజంతా రోడ్లపై పరుగులు తీసే ఈ మనిషి... తన జీవితాన్ని మాత్రం గమ్యానికి చేర్చుకోలేక ఆర్థిక కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నాడు. ఒకప్పుడు ఇంటి బండి నెట్టుకొచ్చిన ఆటో... ఇప్పుడు అప్పులు, డీజిల్ భారం, ఫైనాన్స్ కష్టాలు, తగ్గుతున్న గిరాకీ, పెరిగిన నిత్యావసర ధరలతో డ్రైవర్లకు భారంగా మారింది. రోజంతా కష్టపడి సంపాదించిన దాంట్లో అధిక భాగం డీజిల్, ఆయిల్, మెయింటెనెన్స్ ఖర్చులకే కరిగిపోతోంది. మిగిలిన దాంట్లో కొంత ఫైనాన్స్ కిస్తీలు, ప్రైవేట్ అప్పుల వడ్డీలు, ట్రాఫిక్ జరిమానాలకు పోతుండగా... చేతిలో మిగిలే చిల్లరతో పెరిగిన నిత్యావసర ధరల మధ్య కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. "బతకడానికి ఆటో నడుపుతున్నామా... లేక ఆటో కోసమే బతుకుతున్నామా" అనే పరిస్థితిలో వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఆటో డ్రైవర్ల జీవితాలను వెంటాడుతున్న కష్టాలపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి
(భూక్యా రంజిత్ నాయక్), (ప్రజాజ్యోతి)

# ఆటోవాలాల... అవస్థల బతుకు

- గమ్యాలకు చేరుస్తూ... బతుకును లాక్కెళ్తూ
- ఎండలోనూ... వానలోనూ రోడ్లపైనే జీవితం
- రోజంతా కష్టమే... చేతిలో మిగిలేది చిల్లరే
- డీజిల్ భారంతో తిరగని బతుకు చక్రం
- ఫైనాన్స్ వలలో నలిగిపోతున్న కుటుంబాలు
- వెలవెలబోతున్న ఆటో స్టాండ్లు
- గాడిలో పడని ఆటోవాలాల బతుకులు
- చిన్నచూపు మాటల వెనుక కన్నీటి జీవితం





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా వేలాది కుటుంబాలు ఆటో డ్రైవింగ్ పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లందు, అశ్వారావుపేట వంటి పట్టణాలతో పాటు పల్లె ప్రాంతాల్లో కూడా ఆటోలు ప్రజల నిత్యజీవితంలో కీలక భాగమయ్యాయి. పాఠశాలకు వెళ్లే పిల్లల నుంచి ఆస్పత్రులకు వెళ్లే వృద్ధుల వరకు... కూలీల నుంచి ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరి ప్రయాణంలో ఆటో డ్రైవర్ పాత్ర కనిపిస్తూనే ఉంటుంది. అర్ధరాత్రి వేళల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ముందుగా గుర్తొచ్చేది కూడా ఆటో డ్రైవర్ నే. కానీ సమాజానికి అంత అవసరమైన సేవ అందిస్తున్న వారి జీవితాలు మాత్రం నానాటికీ భారంగా మారుతున్నాయి.

### ››› డీజిల్ భారంతో తిరగని చక్రాలు

జిల్లాలో అధిక సంఖ్యలో డీజిల్ ఆటోలే నడుస్తున్నాయి. గతంతో పోలిస్తే డీజిల్ ధరలు భారీగా పెరగడంతో డ్రైవర్లపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది. ఒకప్పుడు రోజువారీ ఆదాయంలో కొంతమేర కుటుంబ ఖర్చులకు, పిల్లల చదువులకు మిగిలేది. ఇప్పుడు సంపాదనలో సగం డీజిల్ కే వెళ్తోందని డ్రైవర్లు చెబుతున్నారు. దీనికితోడు ఇంజిన్ ఆయిల్, టైర్లు, స్పేర్ పార్ట్స్, రిపేర్లు, సర్వీసింగ్ ఖర్చులు కూడా అమాంతం పెరిగిపోయాయి. "ఆటో బయటకు తీస్తే ఖర్చే తప్ప లాభం కనిపించడం లేదు" అని పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ››› బంకుల క్యూల్లోనే కరిగిపోతున్న సమయం

పట్టణాలతో పాటు పల్లె ప్రాంతాల్లో కూడా డీజిల్ కోసం బంకుల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తోందని డ్రైవర్లు చెబుతున్నారు. ప్రయాణికులను తీసుకెళ్లాల్సిన సమయంలో బంకుల వద్దే నిలబడిపోవడం వల్ల ఆదాయం మరింత తగ్గిపోతోందని వాపోతున్నారు. "ఒకవైపు డీజిల్ ధరలు పెరుగుతున్నాయి... మరోవైపు సమయం కూడా అక్కడికే పోతోంది" అని డ్రైవర్లు చెబుతున్నారు.

### ››› ఉచిత బస్సు ప్రయాణాలతో తగ్గిన గిరాకీ

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత ఆటోలకు ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గిందని డ్రైవర్లు చెబుతున్నారు. ఒకప్పుడు మార్కెట్లు, ఆస్పత్రులు, కార్యాలయాలకు వెళ్లేందుకు ఆటోలు వినియోగించిన మహిళలు ఇప్పుడు ఎక్కువగా బస్సులనే ఆశ్రయిస్తున్నారని పేర్కొంటున్నారు. దీంతో ఆటో స్టాండ్లలో గంటల తరబడి ఎదురు చూసినా సరైన బేరాలు రావడం లేదని వాపోతున్నారు. "ముందు రోజుకు పది ట్రిప్పులు తిరిగేవాళ్లం... ఇప్పుడు ఐదు ట్రిప్పులు కూడా రావడం లేదు" అని డ్రైవర్లు చెబుతున్నారు.

### ››› ఫైనాన్స్ వలలో నలిగిపోతున్న బతుకులు

చాలామంది ఆటో డ్రైవర్లు ఫైనాన్స్ లేదా ప్రైవేట్ అప్పులతో ఆటోలు కొనుగోలు చేశారు. రోజూ ఆటో రోడ్డెక్కితేనే ఈయంఐలు, వడ్డీలు కట్టే పరిస్థితి ఉంది. కానీ ప్రస్తుతం ఆదాయం తగ్గిపోవడంతో కిస్తీలు చెల్లించలేక చాలామంది తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. కొంతమంది ఫైనాన్స్ సంస్థల నుంచి హెచ్చరికలు ఎదుర్కొంటుండగా... మరికొందరు అప్పులు తీర్చలేక ఆటోలు అమ్ముకునే పరిస్థితికి చేరుకుంటున్నారు. "ఆటో కొనుగోలు చేసినప్పుడు బతుకు బాగుపడుతుందని అనుకున్నాం... ఇప్పుడు అప్పుల బారి నుంచి బయటపడడమే కష్టంగా మారింది" అని డ్రైవర్లు చెబుతున్నారు.

### ››› పల్లెల్లో మరింత దారుణ పరిస్థితి



పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఆటో డ్రైవర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని తెలుస్తోంది. పల్లెల్లో బస్సు సౌకర్యాలు పెరగడంతో ఆటోలకు గిరాకీ తగ్గిపోయిందని డ్రైవర్లు చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో రోజంతా తిరిగినా డీజిల్ ఖర్చులు కూడా రాకపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెడు రహదారులు, దూర ప్రాంతాలు, తరచూ వచ్చే రిపేర్లు కారణంగా గ్రామీణ ఆటో డ్రైవర్లపై అదనపు భారం పడుతోంది. "బండి తిప్పేది ప్రయాణికుల కోసం కాదు... అప్పులు తీర్చుకోవడానికే" అని పలువురు డ్రైవర్లు వాపోతున్నారు.

### ››› ఎండైనా... వానైనా రోడ్డుపైనే జీవితం

మండే ఎండల్లోనూ, కుండపోత వర్షాల్లోనూ ఆటో డ్రైవర్లు రోడ్లపైనే గడుపుతున్నారు. వేసవిలో మండే వేడి, వర్షాకాలంలో నీటిమునిగిన రహదారులు, ట్రాఫిక్ ఇబ్బందులు వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. రోజంతా శారీరకంగా శ్రమించినా సమయానికి భోజనం చేయలేని పరిస్థితి. చాలామంది డ్రైవర్లు టీ, బీడీలతోనే రోజు గడుపుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ కుటుంబాన్ని పోషించాలనే బాధ్యతతో రోడ్డెక్కక తప్పడం లేదని డ్రైవర్లు అంటున్నారు.

### ››› చులకన భావన కూడా బాధే

సమాజంలో చాలామంది ఆటో డ్రైవర్లను చిన్నచూపు చూస్తున్నారని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఆటో వాడే కదా" అనే మాట వెనుక ఉన్న చులకన భావన తమను మానసికంగా బాధిస్తోందని చెబుతున్నారు. కానీ ప్రమాద సమయాల్లో, అర్ధరాత్రి వేళల్లో, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ముందుగా గుర్తొచ్చేది ఆటో డ్రైవర్ నే అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల జీవితాల్లో అంత కీలక పాత్ర పోషిస్తున్నా... వారి కష్టాలను గుర్తించే వారు మాత్రం చాలా తక్కువమందేనని అంటున్నారు.

### ››› కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారం

ఆదాయం తగ్గిపోవడంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. పిల్లల చదువులు, ఇంటి అద్దెలు, వైద్య ఖర్చులు, ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక చాలామంది కుటుంబాలు ఆర్థికంగా కుదేలవుతున్నాయి. "రోజు వచ్చిన దాంతో అదే రోజు బతుకుతాం... పొదుపు అనే మాట మర్చిపోయాం" అని పలువురు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో ఇంట్లో పొయ్యి వెలిగించడమే భారంగా మారిందని చెబుతున్నారు.

### ››› ప్రభుత్వం దృష్టి సారించాలంటున్న డ్రైవర్లు

డీజిల్ ధరల నియంత్రణ, ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ పథకాలు, ఫైనాన్స్ రాయితీలు, జరిమానాల విషయంలో సడలింపులు, పట్టణాల్లో సరైన ఆటో స్టాండ్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని డ్రైవర్లు కోరుతున్నారు. ప్రతిరోజూ ప్రజల జీవితాలను గమ్యానికి చేర్చే ఆటో డ్రైవర్ల జీవితాలు కూడా గాడిలో పడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**– రంగు పురుషోత్తం, ఆటో డ్రైవర్**
"రోజంతా ఆటో తిప్పినా చేతిలో ఏమీ మిగలడం లేదు. సంపాదనలో ఎక్కువ భాగం డీజిల్, ఆయిల్ ఖర్చులకే వెళ్తోంది."



**– ఎండి అమీర్ పాషా, ఆటో డ్రైవర్**
"ఈయంఐ, వడ్డీలు, జరిమానాలు కట్టాక ఇంటికి తీసుకెళ్లేది చాలా తక్కువ. ఒక్కరోజు ఆటో బయటకు తీసుకోకపోతే ఇంట్లో పొయ్యి వెలగని పరిస్థితి."



**– వెంకన్న బాబు, డ్రైవర్**
"బస్సుల్లో ఉచిత ప్రయాణం వచ్చిన తర్వాత గిరాకీ బాగా తగ్గింది. స్టాండ్ లో గంటల తరబడి ఎదురు చూసినా బేరాలు రావడం లేదు.పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు చూసుకుంటే చాలా కష్టంగా ఉంది. ముందు కంటే ఇప్పుడు బతుకు మరింత భారంగా మారింది."

